


# నీటిమీది రాతలు

పసుపులేటి తాతారావు

'చేయగలిగిందే చెప్పు, చెప్పిందే చేసి చూపించు...'

ఎంత ఉద్వేగం కలిగించే మాట అది? ఆ అంకుల్ ఎప్పుడూ అన్నీ అలాంటి మాటలే చెపుతూ ఉండే వారు. అందుకే ఆయనంటే ఎక్కడ లేని అభిమానం నాకు. ఆయన మాట్లాడుతుంటే ఇంకా ఇంకా వినాలని ఉండేది. వినే కొద్దీ ఆయన మాటలు నన్ను హిప్నటైజ్ చేస్తున్నట్టుండేవి. అందుకే ముంబయ్‌లో ఉన్నన్నాళ్ళూ వారంలో రెండు రోజులైనా కాలేజి విడిచి పెట్టాకా వాళ్ళింటికి వెళ్ళి ఆయన దగ్గర కూర్చొని నాలుగు మంచి మాటల్ని చెవిన వేసుకుని వస్తుండేదాన్ని.

ప్రేమ వివాహం కాకపోయినా పైసా కట్నం తీసుకోకుండా పెళ్ళి చేసుకున్నాడని తెలిసినప్పుడే ఆయన మీద సదభిప్రాయం ఏర్పడి పోయింది. ఆంటీ కూడా నన్ను ఆదరంగానే చూసేది. ఇంటికి వెళ్ళినప్పుడల్లా టీ కలిపి ఇచ్చేది. ''అంకుల్ లాంటి వ్యక్తిని హస్బెండ్‌గా పొందినందుకు మీరు భలే లక్కీ ఆంటీ'' అని నేనంటే ఆమె నవ్వేసేది. ''ఏం? నెలకి పాతిక వేలు సంపాదించే ఉద్యోగస్థురాలు భార్యగా దొరకడం ఆయన అదృష్టం కాదా?'' అని ఉడికిస్తున్నట్టు మాట్లాడేది. ఇద్దరికిద్దరూ మేడ్ ఫర్ ఈచ్ అదర్‌లా ఉండేవాళ్ళు. వాళ్ళింకా ముంబయ్ లోనే ఉంటున్నారు. బహుశా అక్కడే సెటిల్ అవుతారేమో?

డాడీ ఉద్యోగ బదిలీ రీత్యా నేను ఆంధ్రప్రదేశ్‌లోని ఈ మారు మూల పల్లెటూరికి వచ్చి పడ్డాను. ముంబయ్‌లాంటి నగరాల్లో కొన్నాళ్ళు గడిపి వచ్చిన వాళ్ళకి నిజం చెప్పాలంటే ఇలాంటి పల్లెటూళ్ళలో సమయం గడవదు. ఎక్కడికీ వెళ్ళడానికి



ఉండదు. ఏ ఎంజాయ్‌మెంటూ ఉండదు.

సెల్‌ఫోన్ మోగింది. ఉదయం నుంచీ ప్రతీ ఐదు నిముషాలకొకసారి మోగుతూనే ఉంది. ఈ రోజు నా బర్త్‌డే కాబట్టి ఎక్కడెక్కడినుంచో ఫ్రెండ్స్ ఫోన్ చేసి విషెస్ చెప్తున్నారు. అదే ముంబాయ్‌లో అయితే ఈ పాటికి ఫ్రెండ్స్ అంతా ఇంటికే వచ్చి ఏ రెస్టారెంట్‌కో పార్టీకో తీసుకుపోయి ఉండేవాళ్ళు. ఇక్కడ కాబట్టి ఫోన్‌లలో మాట్లాడి సరిపెట్టుకోవాల్సి వస్తోంది.

అయినా ఇప్పుడు నేను ఆలోచిస్తున్నది అది కాదు. పోయిన సంత్సరం ఇదే రోజు అంకుల్ ఇంటికి వెళ్ళి ''ఈ రోజు నా బర్త్ డే అంకుల్. స్వీట్ తీసుకోండి'' అన్నప్పుడు ఆయన అన్న మాటే ఇంకా నా చెవుల్లో మారు మోగుతోంది.

''స్వీట్ పంచడం, 'హేపీ బర్త్ డే టూ యూ' అని చెప్పించుకోవడం మాత్రమే కాదు బేబీ పుట్టిన రోజుకి అర్థం. పుట్టినందుకు జన్మ సార్థకమయ్యేలా కనీసం ఈ ఒక్క రోజైనా ఏం మంచిపని చేసామని మన అంతరాత్మని ప్రశ్నించుకోవాలి. అప్పుడే పుట్టిన రోజు ఒక నిజమైన పండుగ అవుతుంది.''

ఎంతో ఉత్తేజాన్ని కలిగించిందా మాట. ఫ్లాట్ అయిపోయాను.

ఇంతవరకు 'బర్త్ డే' అని చెప్పినప్పుడు మెనీ హేపీ రిటర్న్స్ ఆఫ్ ది డే అని చెప్పిన వాళ్ళే తెలుసు కానీ ఇలా ఈ రేంజ్‌లో హితబోధ చేసిన వాళ్ళెవరూ తగల్లేదు. ఆ రోజునుంచీ ఆ మాటే నా మనసులో స్థిర పడిపోయింది. దానిగురించే ఆలోచించడం మొదలు పెట్టాను.

రెండు రోజుల తర్వాత వాళ్ళింటికి వెళ్ళినప్పుడు ''అంకుల్ మీరు చెప్పిన మాట నన్ను బాగా ఇన్‌స్పైర్ చేసింది. ఇకనుంచి ప్రతీ పుట్టిన రోజుకీ ఏదో ఒక మంచి పని చేయాలని స్ట్రాంగ్‌గా డిసైడ్ అయ్యాను.''

''గుడ్. చాలా మంచి డిసిషన్. కాకపోతే ఇలాంటి మంచి నిర్ణయాలు ఆవేశంలో తీసుకుంటాం. ఆచరణలో పెట్టేటప్పటికి చల్లబడిపోతుంటాం. నువ్వలా కాకూడదని నా ఆకాంక్ష'' అన్నారు.

''అలాగే అంకుల్. అయితే మీ పుట్టిన రోజు నాడు మీరేమేం చేస్తుంటారో తెలుసుకోవాలని ఉంది. అభ్యంతరం లేకపోతే చెపుతారా?'' అని అడిగాను.

ఊహించని ఆ ప్రశ్నకి ఆయన గతుక్కుమని ఆ తర్వాత బిగ్గరగా నవ్వేసారు. ''గడుసు దానివే'' అన్నారు. ''నిజం చెప్పాలంటే నేను ఇంత వరకూ ఏ మంచి పనీ చేయలేదు.'' అన్నారు కాస్సేపు ఆలోచించి.

నేను షాక్ అయ్యాను. ''లేదా ? అదేమిటి?'' అన్నాను నమ్మకం కలగనట్టు.

''అందుకేగా నేను ఏ సంవత్సరమూ పుట్టిన రోజు జరుపుకోనిది?'' అన్నారు గలగలా నవ్వేస్తూ.

అవును. ఆయనన్నదీ నిజమే. ఏదైనా మంచి పని చేయడమే పుట్టిన రోజు పండగకి సార్థకత అని చెప్పారు. కానీ ప్రతీ మనిషీ ప్రతి పుట్టిన రోజు నాడూ ఏదో ఒక మంచి పని చేయాలని చెప్పలేదు. తానిలా చేస్తున్నానని అసలే చెప్పలేదు. ఏది ఏమైనా నేను నా నిర్ణయాన్ని మాత్రం మార్చుకోదల్చుకోలేదు. ఎందుకంటే ఆ భావం నాకు బాగా నచ్చింది కాబట్టి.

దాని గురించే నేనిప్పుడు ఆలోచిస్తున్నది, ఏం చేస్తే బాగుంటుందా అని. అప్పుడు స్ఫురించింది చిన్న ఆలోచన చాలా చిన్నదే కావచ్చు. ప్రారంభం ఎప్పుడూ చిన్నదిగానే ఉంటుందిగా? ఆకాశాన్నంటే మర్రిచెట్టు కూడా చిన్న విత్తనం నుంచే కదా మొలకెత్తేది? ఆ మాట కూడా ఏదో సందర్భంలో ఆ అంకులే చెప్పారు.

ఎల్లో పేజెస్ పుస్తకం తీసి వెదికాను. కొన్ని పేజీలు తిరగేసాకా నాకు కావలసింది కనిపించింది. 'వానప్రస్థ ఓల్డ్ ఏజ్ హోమ్.' ఏదో సామాజిక సేవా సంస్థ చేత నిర్వహించబడుతున్న వృద్ధాశ్రమం.

డాడీని అడిగి కారు తీసుకుని బయల్దేరాను. బజారులోకి వెళ్ళి రెండు బుట్టల నిండా ఆపిల్స్, బత్తాయిలు, కమలాలు పేక్ చేయించి కారులో పెట్టుకున్నాను. అక్కడినుంచి సరాసరి పుస్తక ప్రదర్శనశాలకి వెళ్ళి పురాణ కథలు, భగవద్గీత లాంటి ఆధ్యాత్మిక గ్రంధాలు కొన్ని తీసుకుని కారులో పెట్టుకున్నాను.

తర్వాత కారుని పాత పట్టణంలో ఉన్న వృద్ధాశ్రమం దగ్గరికి తీసుకెళ్ళాను. కారు దిగి లోపలికి వెళ్ళబోతుంటే చాలా సంతృప్తిగా అనిపించింది. ఒక మంచి పని చేస్తున్నానన్న సంతృప్తితో ఇంతటి ఆనందముందా అని ఆశ్చర్యపోయాను. బాయ్ ఫ్రెండ్‌తో కలిసి ఎన్ని డిస్కోథెక్‌లకి వెళ్ళితే ఇలాంటి సంతృప్తి కలుగుతుంది? ఇంత మంచి ఆలోచనకి బీజం వేసిన ముంబయ్ అంకుల్‌కి మనసులో మరొక్కసారి థాంక్స్ చెప్పుకున్నాను.

''ఏమ్మా బాగున్నావా?'' ఎంతో ఆప్యాయంగా గేటు దగ్గరే వినిపించిన ఆ పిలుపుకి ఉలిక్కి పడ్డాను. ఇక్కడ నన్ను పలకరించేదెవరా అని ఆశ్చర్యంగా చూసాను.

ఎవరో పరిచయం లేని స్త్రీ నిండుగా తయారై ఎక్కడికో బయల్దేరుతున్న దానిలా నిలబడి ఉంది. వయసు అరవై వరకూ ఉండొచ్చు. కానీ ఆరోగ్యంగా ఉంది. పెదాల మీద చెరగని చిరునవ్వు. ఆమె పక్కనే నేల మీద చిన్న సూట్‌కేస్ ఉంది. ఆమె ముఖం సంతోషంతో వెలిగిపోతోంది. చూడ్డానికి సాక్షాత్తూ పరమేశ్వరీదేవిలా ఉంది అంటే అతిశయోక్తి కాదేమో.

నేను కాస్త తడబడి ''ఆ. ఆ. బాగానే ఉన్నానమ్మా. ఇంతకీ మీరు...?'' అంటూ అర్థోక్తిలో ఆగిపోయాను. నన్ను బాగా తెలిసున్నట్టు పలకరించిన వ్యక్తిని ''మీరెవరూ'' అని అడగడానికి నోరు రాలేదు మరి.

''నేనీ వృద్ధాశ్రమంలో ఉంటున్నానమ్మా ఇన్నాళ్ళూ. ఈ రోజు మా అబ్బాయి వచ్చి నన్ను తీసుకు వెళతానన్నాడు. అందుకే ఎదురు చూస్తున్నాను'' అన్నది కళ్ళల్లో కాంతి నింపుకుంటూ. అప్పుడర్థమైంది నాకు. మనసులో పెల్లుబికే ఆనందాన్ని ఎవరితోనైనా పంచుకుంటే తప్ప తనివి తీరదు. అందుకే నేనెవరో తెలియకపోయినా చెప్పకుండా ఉండలేక పోయిందా శుభవార్తని.

నాకు చాలా సంతోషం వేసింది. లోపలికి ప్రవేశిస్తూనే ఎంత మంచి శకునం? బిక్కుబిక్కుమంటూ ఎవరూ లేని దానిలా వృద్ధాశ్రమంలో బ్రతుకు వెళ్ళ

బుచ్చే ఒక అమ్మని ఆమె కొడుకు వచ్చి తీసుకెళుతూ ఉండడం ఎంత మధురమైన సంఘటన? అలాంటి అద్భుత ఘడియల్లో నేనా ఆశ్రమంలోకి ప్రవేశించడం నా అదృష్టంగానే భావించాను. ఇక నా పుట్టిన రోజు వేడుక సార్ధకమయినట్టే కదా?

కారులో ఉన్న బుట్టలోంచి రెండు ఆపిల్స్, బత్తాయిలు తీసి ''చాలా సంతోషమమ్మా. మంచి వార్త వింటున్నాను. మీ అబ్బాయికి నా అభినందనలు తెలియజేయండి'' అన్నాను పళ్ళు ఆమె చేతిలో పెడుతూ. ఆమె మురిపెంగా తీసుకుని దాచుకుంది వాటిని.

నేను లోపలికి వెళ్ళి మేనేజర్‌ని కలిసి ''ఈ రోజు నా పుట్టిన రోజండి. ఏదో నా తృప్తి కోసం ఇక్కడి వాళ్ళందరికీ ఈ సందర్భంగా పళ్ళు పంచుదామనుకుంటున్నాను. మీరు పర్మిషన్ ఇస్తే'' అన్నాను. దానికతను ''అయ్యో. దానిదేముందమ్మా. అలాగే పంచండి'' అంటూ పనిమనిషిని పిలిచి పళ్ళ బుట్టలు లోపలికి తీసుకు వచ్చే పని పురమాయించాడు.

''ఇక్కడుంటున్న వాళ్ళందరినీ ఒకే చోటకి చేర్చగలరా? వ్లాళతో కాస్సేపు గడిపి పళ్ళు పంచి అప్పుడు వెళ్ళిపోతాను'' అన్నాను.

''అలాగేనమ్మా. తప్పకుండా'' అంటూ అతను ఆ ఏర్పాట్లలో మునిగిపోయాడు. కాస్సేపటికి ఆశ్రమంలోని వృద్ధులంతా హాల్లో సమావేశమయ్యారు. అప్పుడప్పుడూ అలా జరుగుతూనే ఉంటుందట అక్కడ. వాళ్ళూ వీళ్ళూ వచ్చి కబుర్లు చెప్పడం, పురాణ కాలక్షేపాలు నిర్వహించడం, భజనలు చేయించడం లాంటివి అక్కడ చోటు చేసుకుంటూ ఉంటాయిట. అప్పుడప్పుడూ డాక్టర్లు కూడా వచ్చి చిన్న చిన్న పరీక్షలు, చికిత్సలు ఉచితంగా చేసి పోతుంటారు.

వాళ్ళతో మాట్లాడిన అరగంటలో నాకు ఆశ్చర్యం గొలిపిన సంగతి ఏమిటంటే అక్కడున్న వాళ్ళందరికీ కొడుకులో, కూతుళ్ళో ఉన్నారని. కేవలం వదిలించుకోడానికి మాత్రమే వాళ్ళనిక్కడ వదిలి పెట్టి వెళ్ళారని. గుండెలో కలుక్కుమని గుచ్చుకుందా మాట.

వాళ్ళ ముఖాల్లో ఎన్నాళ్ళుగానో గూడుకట్టుకున్న దైన్యాన్ని చూడగానే మనసు కలచివేసింది. జీవితపు చరమాంకంలో ఉన్న వాళ్ళని ఎవరికీ చెందని వాళ్ళుగా అక్కడ వదిలి పెట్టి వెళ్ళడం నిజంగా ఎంత దారుణం? ఏ మనిషికైనా కాస్తంత ఆసరా, తోడు కావలసింది ఆ వయసులోనే కదా. అయినా అంత నిర్దాక్షిణ్యంగా వాళ్ళనిక్కడ వదిలేసి వెళ్ళారంటే వాళ్ళ రాక్షస మనస్తత్వాన్ని ఏ నాగరిక కోణంలో అర్ధం చేసుకోవాలో తోచలేదు.

ఒక కొత్త వ్యక్తి తమ కోసం రాగానే వాళ్ళ ముఖాల్లో కనిపించిన వెలుగు వెలుగులా తోచలేదు. పేలవమైన ఆ వెలుగు అంతకు ముందు వాళ్ళ మనసుల్లో తిష్ట వేసుకున్న చీకటినే ప్రస్ఫుటంగా చూపిస్తోంది. ఆత్మీయత కోసం, అనుబంధాల కోసం వాళ్ళు ఎంతగా మొహం వాచిపోయి ఉన్నారో దయనీయంగా తెలియజేస్తోంది.

క్షణం తీరిక లేని ఓ నవనాగరీకపు ధనార్తీ, అత్యాశల సుడిగుండంలో పడి కొట్టుకు పోతున్న ఓ అవిశ్రాంత దాహార్తీ, నీ నిర్లక్ష్యపు నీలినీడల మాటున ఎన్ని మమతానురాగాలు మరుగున పడి మాయమయి పోతున్నాయో ఎప్పటికైనా గ్రహించగలవా?

పళ్ళు, పుస్తకాలు పంచడం అయిపోయాకా అక్కడున్న వాళ్ళందరితోనూ ఆత్మీయంగా మాట్లాడి బయటికి వచ్చేస్తుంటే మనసు భారంగా మారిపోయింది. తొమ్మిది నెలలు కడుపులో దాచుకుని ఒకరూ, తొమ్మిదేళ్ళు భుజాల మీదకి ఎత్తుకుని ఒకరూ మన భారాన్ని సంతోషంగా భరించిన వాళ్ళే కొడిగట్టిన దీపంలాంటి జీవన సంధ్యాసమయంలో మనకి భారంగా మారిపోతున్నారన్న చేదు నిజాన్ని ఎలా జీర్ణంచుకోగలుగుతున్నాం?

గాఢాంధకారంలో చిరుదివ్వెలా చిన్న ఆశాకిరణం ఏమిటంటే తమ తప్పుని తెలుసుకుని ఓల్డ్ ఏజ్ హోమ్‌లోంచి తమ వాళ్ళని తిరిగి తీసుకెళ్ళే కొడుకులు ఇంకా ఉన్నారన్న సంగతి ఇప్పుడే తెలియడం. గేటు దగ్గర నిలుచుని కొడుకు కోసం ఎదురు చూస్తున్న వృద్ధురాలే అందుకు నిదర్శనం.

బయటికి వచ్చేస్తూ మేనేజర్‌కి ఆ విషయంలో చిన్న కాంప్లిమెంట్ ఇవ్వాలనిపించింది. ''మీ ఓల్డ్ ఏజ్ హోమ్ నిర్వహణ చాలా బాగుందండీ. పిల్లలు తమ తల్లిదండ్రుల్ని ఓల్డ్ ఏజ్ హోమ్‌లో చేర్చడమే తరచుగా చూస్తాం కానీ తిరిగి ఇక్కడి నుంచి తీసుకెళ్ళడం చాలా అరుదు. అలాంటిది మీ హోమ్‌లో చోటు చేసుకోవడం చాలా ఆనందకరమైన విషయం'' అన్నాను మెచ్చుకోలుగా.

మేనేజర్ అయోమయంగా చూసాడు. ''ఏమిటి మేడమ్ మీరు మాట్లాడేది? మా హోమ్‌లోంచి ఎవర్ని తీసుకెళుతున్నారు? ఎవరు తీసుకెళుతున్నారు? అలాంటిదేం లేదే?'' అన్నాడు.

నేను విస్తుబోయి చూసానా మాటకి. ''ఇందాక లోపలికి వస్తొంటే గేటు దగ్గర...'' అంటూ చెప్పబోయాను.

''ఓహో అదా? అదో విషాదకరమైన సంగతి మేడమ్'' అన్నాడు మేనేజర్ దీర్ఘంగా నిట్టూర్చుతూ.

నేను ఆసక్తిగా వింటుండి పోయాను.

''ఇప్పుడామెనెవరూ వచ్చి తీసుకెళ్ళడం లేదు మేడమ్. అయినా ఆమె అక్కడే నిలబడి రాని తన కొడుకు కోసం అలా ఎదురు చూస్తూనే ఉంటుంది. అది రోజూ జరిగే తంతు. నాలుగేళ్ళ క్రితం కొడుకు ఆమెనిక్కడ చేర్చి ఆమెతో మాత్రం ''మరి కాస్సేపటిలో వచ్చి తీసుకెళ్తాను. ఇక్కడే ఉండు'' అని చెప్పి వెళ్ళిపోయాడట. చదువు రాని ఆమెకి ఇది వృద్ధాశ్రమం అని తెలీదు పాపం.

''కొడుకు మరిక రాడు అన్న శరాఘాతం లాంటి నిజం విన్నాకా ఆమె విపరీతమైన షాక్‌కి గురయింది. ఏ తల్లి అయినా తన బిడ్డల్ని అమితంగా ప్రేమిస్తుంది. అలాగే ఆ బిడ్డలు తనని ప్రేమిస్తారని నమ్ముతుంది. కొడుకు తననలా దిక్కులేని దానిలా వదిలి వెళ్ళాడన్న సంగతిని ఆమె మనసు అంగీకరించ లేకపోయింది. అందుకే ప్రతీ రోజూ తన కొడుకు వస్తాడు, తనని తీసుకెళతాడు అని మనస్ఫూర్తిగా నమ్ముతోంది. సూట్ కేస్ సర్దుకుని గేటు దగ్గరే నిలబడుతుంది. ఎవరు ఏం చెప్పినా వినదు. భోజన సమయంలో మేము బలవంతం చేస్తే వచ్చి భోంచేసి మళ్ళీ గేటు దగ్గరికి సూట్‌కేస్‌తో పోయి నిలబడుతుంది. కనిపించిన వాళ్ళందరికీ తన కొడుకు ఈరోజే వచ్చి తనని తీసుకు పోతున్నాడని చెప్పి ప్రతీరోజూ మురిసి పోతుంది. రాత్రి వరకూ అలాగే ఎదురు చూస్తూ నిలబడుతుంది. అప్పుడు మేము వెళ్ళి ఒక అబద్ధం చెపుతాం. ఈ రోజు రైలు కేన్సిల్ అయ్యిందట. రేపు వస్తానని మీ అబ్బాయి ఫోన్ చేసాడు అని చెప్పగానే ఆమె ముఖం చిన్న బుచ్చుకుని లోపలికి వచ్చి పడుకుంటుంది. మరునాడు తిరిగి మామూలే. అలా నాలుగేళ్ళుగా జరుగుతోంది'' అని చెప్పాడు బాధగా.

అది వినగానే నా గుండె కలచివేసినట్టయింది. ఎంత సంతోషం? ఎంత మురిపెం? ఎంత ఆశాభావం? అవన్నీ షాక్ వల్ల కలిగిన అసత్యాలేనా? గాఢాంధకారంలో లీలగా కనిపించిన ఓ చిన్న చిరుకాంతి కూడా భ్రమాజనితమైపోవాలా? ఆమె ఎవరో నాకు తెలియదు. ఆమెకీ నాకూ ఎలాంటి సంబంధం లేదు. అయినా మనసు అంతులేని ఆవేదనకి గురయింది. అలాంటిది కన్న కొడుకు...! కన్న కొడుకు...!! కన్న కొడుకు...!!! ఆమెని వదిలి ఎలా వెళ్ళిపోయాడో అర్ధం కావడం లేదు.

''ఎవరినైనా చేర్చుకునే ముందు జాయిన్ చేసిన వాళ్ళ వివరాలు తీసుకుంటారేమో కదా?'' అని అడిగాను.

''తీసుకుంటాము మేడమ్. కానీ అతను కావాలనే తప్పు అడ్రస్ ఇచ్చాడు. అతను ఎక్కడుంటాడో తెలీదు. ఏం చేస్తుంటాడో తెలీదు. మొబైల్‌కి ఫోన్ చేస్తే రెండు మూడు సార్లు ఎత్తి మాట్లాడాడు. ఆమెకి షాక్‌కి గురైందన్న సంగతి తెలియజేసినా అతని మనసు కరగలేదు. తానామెని తీసుకు వెళ్ళలేనని ఖరాఖండిగా చెప్పేసాడు. ఆ తర్వాత ఎన్ని ఫోన్‌లు చేసినా ఎత్తడమే మానేసాడు. మా ఫోన్‌ని గుర్తు పడుతున్నాడని మేము వేరే ఫోన్‌ల నుంచి చేస్తే మేమెవరమో తెలుసుకోగానే ఫోన్ పెట్టేయడం

కవిత
poem

## నీ పరిధిలో




నీ దేశం ఇది అని
నీ ఉనికిని చాటుకోగానే
నీ ఊరు ఏదన్నది? ఉదయించే ప్రశ్న!!
నీ ఊరిలో నీవు నివసించేది? తూర్పునా, పడమరా
నీ ఊరికి ఉత్తర దిక్కులోనా? దక్షిణానా? ఏ వీధి
నీ యిల్లు? నీ ఆస్తి నీ పేరు ప్రఖ్యాతులు, యిక
నీ కుటుంబం, ఆ మమకారంతో నీ వాళ్ళని నువ్వనుకునే
నీ భర్త లేక భార్య నీ పిల్లలు, యిలా నీది అన్న
నీ స్వార్ధం పెరిగి పెరిగి నీ చుట్టూ నువ్వే గీసుకున్న
నీ పరిధిలో చివరికి మిగిలేది 'నువ్వు' ఒంటరిగా.

–అరుణ శర్మ నిమ్మగడ్డ

మొదలెట్టాడు. ఇక విసుగెత్తి మేమే ఫోన్ చేయడం మానేసాం'' అన్నాడు.

''మీరేమీ అనుకోక పోతే అతని నెంబరు నాకిస్తారా?'' అని అడిగాను. మేనేజర్ చిన్న కాగితం మీద అతని ఫోన్ నెంబర్ వ్రాసి ఇచ్చాడు.

వెళ్ళడానికి కారు ఎక్కబోతూ అప్రయత్నంగా ఆ వృద్ధురాలివైపు చూసాను. వీడ్కోలుగా చేయి ఊపుతూ కనిపించింది. అదే ఆశాభావం ఆమె కళ్ళల్లో. అదే చిరునవ్వు పెదాల పైన. కొడుకు వచ్చి తీరుతాడన్న అచంచలమైన విశ్వాసం. అది నిజం కాదని ఆమెని నమ్మించే శక్తి బహుశా ఈ సృష్టిలోనే లేదేమో. అప్రయత్నంగా నా కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లాయి. ఏమిటీ లోకం? ఎందుకింత నిర్దయ ఈ మనుషుల్లో? అనుకుంటుండగా కారు ముందుకు కదిలిపోయింది.

ఆ రోజంతా మూడీగానే గడిపాను. పుట్టిన రోజు అన్న సంగతి కూడా మరిచిపోయేంతగా మనసు చెదిరిపోయింది. మాటిమాటికీ ఆ వృద్ధురాలి ఆశాపూరితమైన కళ్ళే గుర్తొస్తున్నాయి. ''మా అబ్బాయి వస్తాడు. ఇప్పుడే నన్ను తీసుకుపోతాడు'' అని సంతోషంతో చెప్పిన ఆమె మాటలే ఇంకా నా చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. భగవంతుడా ఎందుకయ్యా తల్లి మనసులో కొడుకుల మీద అంత మమకారాన్ని దట్టించి వదులుతావు? కొడుకిక రాడేమో అన్న చిన్న అనుమానం ఆమె మనసులోకి నాలుగేళ్ళల్లో ఒక్కరోజైనా రాలేదేం? ఆమె ఆశ ఎప్పటికైనా నెరవేరితే ఎంత బాగుణ్ణు? అనుకోకుండా ఉండలేకపోయాను.

వృద్ధాశ్రమాలున్నది అనాథలైన వృద్ధుల్ని ఆదుకోడానికి మాత్రమే అనీ, తాము హాయిగా ఉండడం కోసం వాళ్ళని వదిలించుకోడానికి ఏర్పాటు చేసిన నరక కూపాలు కాదని ఈ స్వార్థపరులు ఎప్పుడు గ్రహిస్తారో?

వృద్ధాశ్రమంలో పళ్ళు, పుస్తకాలు పంచడంతో నా బాధ్యత పూర్తి అయిపోయినట్టు అనుకోలేదు నేను. ఇప్పుడు నా మీద ఒక సరికొత్త బాధ్యత పడినట్టు అనిపించింది. ఆమె కొడుకు మొబైల్ నెంబరు నా దగ్గర ఉంది కాబట్టి అతనితో ఒకసారి మాట్లాడాలనిపించింది.

నేనెవరో తెలీదు కాబట్టి అతను తప్పకుండా మాట్లాడుతాడు. అసలు విషయం చెప్పకుండా పరిచయం పెంచుకుంటాను. ఫోన్ ఫ్రెండ్‌షిప్ చేస్తాను. తియ్యగా మాట్లాడుతాను. క్రమంగా అతన్ని ముగ్గులోకి దించుతాను. ఆ పైన ఒకసారి అతన్ని కలుసుకునే ఏర్పాటు చేస్తాను. ఒక ఆడపిల్ల తలుచుకుంటే అది పెద్ద కష్టమైన పనేం కాదు. అతను దొరికే సమయానికి నలుగురు పెద్ద మనుషుల్నీ అక్కడ ఏర్పాటు చేసి అతనికి బుద్ధి వచ్చేట్టు గడ్డి పెట్టిస్తాను. ముందుముందెవరూ తమ తల్లిదండ్రుల్ని వదిలించుకోవాలన్న ఆలోచన చేయకుండా అతనికి సరైన గుణపాఠం నేర్పుతాను. ఫలితం ఏమైనా కానీయ్. అసలు ప్రయత్నమంటూ చేయాలిగా. అందుకే ఈ క్షణమే ఫోన్ చేయాలని నిశ్చయించుకున్నాను. అలా అనుకోగానే మనసు కొద్దిగా కుదుట పడినట్టయింది.

మొబైల్ తీసి చీటిలో వ్రాసుకున్న నెంబర్‌కి డయల్ చేసాను. రింగ్ అవుతోంది. ఊపిరి బిగబట్టి అతని స్వరం కోసం ఎదురు చూస్తూ కూర్చున్నాను. కాస్సేపటికి రింగ్ ఆగిపోయి కాల్‌ని ఏక్సెప్ట్ చేసిన శబ్దం వినిపించింది.

''హాయ్ మయూరీ. హౌ ఆర్ యూ?'' అని వినిపించి ఉలిక్కి పడ్డాను. అవతలి వైపునుంచి నా పేరు వినిపించిందేమిటి అని ఆశ్చర్యపోవడం నా వంతయింది. సరిగ్గా గుర్తు రావడం లేదు కానీ పరిచయం ఉన్న కంఠంలాగే ఉందది.

''వెళ్ళిపోయిన సంవత్సరానికి ఇప్పుడు గుర్తొచ్చానా? యూ ఆర్ బేడ్ గాళ్'' అంటూ వినిపిస్తోంది అవతలి కంఠం. అంతులేని విస్మయం నాలో. క్రమంగా గుర్తొచ్చింది. గుర్తొచ్చిన మరుక్షణం శిలాప్రతిమలా నిలబడిపోయాను. అవతలి వైపునుంచి ఆ కంఠస్వరం ఇంకా మాట్లాడుతూనే ఉంది.

అది ఎవరిదో కాదు. ఇదివరకు తనకి నీటి మీది రాతల్లాంటి ఎన్నెన్నో మంచి సూక్తుల్ని చెప్పి ఇన్‌స్పిరేషన్ కలిగించిన మహానుభావుడు – ముంబయ్ అంకుల్‌ది!

*

రచయిత సెల్ నెం: **94919 74648**

